క్లుప్తంగా

పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ

ఇబ్రహీంపట్నం: పశువుల షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీ లభిస్తుందని ఏపీఓ ఎం.ప్రమీల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం, పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం పథకంలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతు వాటాగా 10 నుంచి 30 శాతం భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

తిరువూరు: పోలీసు కేసులు నమోదైన వారు సత్ప్రవర్తనతో మెలగాలని తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకుని సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కేసుల్లో ఉన్న వారు నేరప్రవృత్తి కొనసాగితే కఠినశిక్షకు గురవుతారని హెచ్చరించారు. సెక్టార్–2 ఎస్‌ఐ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు కిడ్నీ వ్యాధిగ్రస్తులు మృతి

అనుముల్లంక(గంపలగూడెం): మండలంలోని అనుముల్లంకలో ఆదివారం ఇద్దరు కిడ్నీ వ్యాధిగ్రస్తులు మృతిచెందారు. గ్రామానికి చెందిన కనకపూడి దాసు, కనకపూడి భారతి దీర్ఘకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆదివారం మృతిచెందారని వారి బంధువులు తెలిపారు.

కాలినడకన వీరాంజనేయ స్వామి సన్నిధికి



మేడూరు(గంపలగూడెం): హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం కాలినడకన చేరుకున్నారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. 108 పాదయాత్రల్లో భాగంగా 13వ పర్యాయం పౌర్ణమి సందర్భంగా కాలినడకన వీరాంజనేయస్వామి ఆలయానికి వెళ్లామని ఆంజేయస్వామి భక్తమండలి సభ్యులు తెలిపారు.

వేణుగోపాలుని కల్యాణం



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి మాస కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు అర్చక బృందంచే సత్యభామ, రుక్మిణీదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. 12 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, భక్తులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

తిరువూరురూరల్: ఆంజనేయపురం గ్రామ వీధుల్లో దోమల నిర్మూలనకు ఆదివారం ఫాగింగ్ చేయడంతో పాటు మురుగు కాలువ నీటిలో దోమలు ప్రబలకుండా లార్వా నిర్మూలన చర్యలు చేపట్టారు. సర్పంచి మామిడి కుటుంబరావు, చౌటపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ మధుసూదనరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పర్యవేక్షించారు.

కరాటేలో బాలల ప్రతిభ



తిరువూరు: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తిరువూరుకు చెందిన పలువురు బాలబాలికలు బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించారు. విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో సినీ హీరో సుమన్, మద్ది కన్నంగౌడ్‌ల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో తిరువూరు ఎక్స్‌లెన్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు కటా విభాగంలో సోముల శ్రీశ్రావ్యకృత్య, పెద్దిబోయిన సింధు, అనిగళ్ల శారదా మనస్వి బంగారు పతకాలు సాధించారు. మూడు సాయి, వరలక్ష్మీలు వెండి పతకాలను సాధించారు. కుమిటే విభాగంలో మోదుగు వశిష్ట బంగారు పతకం, అనిగళ్ల నిఖిల్ పవన్, మోదుగు రుషి రజత పతకాలను గెలుచుకున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదివారం తెలిపారు. సమస్యలపై డివిజన్ ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- ఆలయాల్లో భక్తుల రద్దీ
- సాయిబాబాకు ప్రత్యేక పూజలు
- పలు చోట్ల అన్నదానాలు

తిరువూరు: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం తిరువూరు పట్టణంలో జరిగాయి. స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో తెల్లవారు ఝాము నుంచి సాయిబాబాను భక్తులు దర్శించుకున్నారు. సాయిబాబాకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయి కల్యాణ మండపంలో ఐదు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు కందుల విజయకుమార్‌ను మందిర కమిటీ సభ్యులు సన్మానించారు.


● **గంపలగూడెం:** గంపలగూడెం షిర్డీ సాయి బాబా ధ్యాన నిలయంలో గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, షిర్డీ సాయి బాబాలకు పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం నిర్వహించారు. బాబాకు నూతన వస్త్రాలు, వివిధ రకాల పూలు, ఆభరణాలతో విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. పెనుగొలను రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని షిర్డీ సాయి బాబా మందిరంలో బాబాకు భక్తులు స్వయంగా 108 బిందెల జలంతో అభిషేకం నిర్వహించారు. అన్నదానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● **విస్సన్నపేట:** స్థానిక షిర్డీ సాయి సేవా మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువులను సన్మానించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని కొండపల్లి షిర్డీ సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● **ముసునూరు:** మండలంలోని చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, వేల్పుచర్ల గ్రామాల్లోని షిర్డీ సాయిబాబా మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెక్కపల్లిలో ఉదయం బాబాకు విశిష్ట అభిషేకాలు, సత్యసాయి వ్రతాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** స్థానిక గన్నవరం రోడ్డులోని వరసిద్ధి సాయిబాబా ధ్యాన మందిరంలో బాబాకు ఉదయం కాగడ హారతితో పూజలు, విశేష అభిషేకాలు చేశారు. సింగన్నగూడెం బస్టాప్ వద్ద సర్వ కార్యసిద్ధి షిర్డీ సాయిబాబా మందిరంలో విరూపా టౌన్‌షిప్‌లో బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.




తిరువూరు సాయిబాబాకు విశేష అలంకారం; తిరువూరు సాయిబాబా మందిరంలో భక్తుల రద్దీ



పెనుగొలనులో బాబాకు జలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



విస్సన్నపేట షిర్డీ సాయి మందిరంలో సాయిబాబా



కొండపల్లిలో సాయిబాబా ఆలయంలో భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంపలగూడెం: ప్రధాన లైన్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జగదీష్ తెలిపారు. మండలంలోని ఊటుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని నెమలి, ఉమ్మడదేవరపల్లి, కొణిజెర్ల గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

హైస్కూల్ రోడ్డులో వ్యర్థాల తొలగింపు



సాక్షి స్పందన

ఆగిరిపల్లి: స్థానిక హైస్కూల్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలను, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. శుక్రవారం 'సాక్షి'లో కుళ్లిన చెత్తతో పడుతున్న ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు రోడ్డు పక్కన ఉన్న చెత్తను, వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్‌లో తరలించారు.

తిరువూరు డివిజన్‌లో భారీ వర్షం

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. వర్షంతో జనజీవనం స్తంభించింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తిరువూరు మండలంలో 7.6 మిల్లీమీటర్లు, ఎ.కొండూరు మండలంలో 4 మి.మీ, గంపలగూడెం మండలంలో 3.4 మి.మీ, విస్సన్నపేట మండలంలో 3.2 మి.మీ, రెడ్డిగూడెం మండలంలో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు: వాగులకు వరదలు వస్తున్నందున గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యటించి వాగుల్లో వరద పరిస్థితిని పరిశీలించారు. వావిలాల–మునుకుళ్ల గ్రామాల నడుమ అలుగు వాగు పొంగుతున్నందున వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ సూచించారు. రైతులు పొలం పనులకు వెళ్లేటప్పుడు వాగులు దాటవద్దని, విద్యుత్ వైర్లు, స్తంభాల వద్దకు వెళ్లవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చాట్రాయి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద కొనసాగుతోంది. ఎగువున కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. సాయంత్రం ఆరు గంటలకు 2,361 క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి చేరుతోందని, ప్రస్తుతం 346 అడుగుల మేర నీటిమట్టం ఉందని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.

పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు, ప్రహరీ

ముసునూరు: భారీ వర్షాలకు రమణక్కపేటలోని ఓ ఇల్లు, ప్రహరీ పాక్షికంగా దెబ్బతిందని తహసీల్దార్ జవహర్‌బాజీ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఆదివారం రమణక్కపేట గ్రామంలో ఆముదాల సుబ్బారావుకు చెందిన ఇంటి గోడ, షేక్ అజీమున్నీసాకు చెందిన ప్రహరీ పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆయన వివరించారు.



చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగులో ప్రవహిస్తున్న వరద

● **వెల్లంకి(వీరులపాడు):** ఆషాఢమాసం సందర్భంగా వెల్లంకిలోని ముత్యా లమ్మ అమ్మ వారికి మహిళలు బోనాలు సమర్పించి పూజలు చేశారు. మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మ వారి గ్రామోత్సవం జరిగింది.

నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కిలేశపురం పాత పంచాయతీ కార్యాలయం ఎదురు వీధిలో నివాసాల మధ్య మురుగునీరు నిలవ ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై నెలల తరబడి మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వృద్ధులు, చిన్నారులు రోడ్డుపై నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, మరోవైపు మురుగునీటితో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. మురుగునీటి సమీపంలోని ఓ ఇంటి యజమాని విరోచనాలు, వాంతులతో ఇటీవల ఇబ్బందులు పడ్డారు. విష జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా రోడ్డుపై నిలిచిన మురుగునీటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కిలేశపురం పాత పంచాయతీ ఎదురు వీధిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

శాకంబరిగా కోట మహాలక్ష్మి అమ్మవారు



విస్సన్నపేట కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి అలంకారం



శాకంబరి అలంకరణలో కోట మహాలక్ష్మమ్మ అమ్మవారు

మైలవరం: మైలవరంలోని కోట మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ చైర్మన్, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో వంశ పారంపర్య ధర్మకర్తలు ఎస్వీ నివృత్‌రావు పర్యవేక్షణలో శాకంబరి మహోత్సవం ఆదివారం నిర్వహించారు. సుమారు 30 మంది శ్రీవారి సేవకులు, ఆలయ సిబ్బంది, ఉత్సవ నిర్వాహకులు నాగులూరి దుర్గాప్రసాద్, సిటీ కేబుల్ రత్తయ్య, మల్లెల జమలేశ్వరరావు, ప్రకాశరావు, చిట్టిబాబు పాల్గొని అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. లలితా పారాయణం నిర్వహించారు.

శాకంబరిగా దుర్గమ్మ..

విస్సన్నపేట: స్థానిక ద్వారకానగర్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి 'శిక్షా సప్తాహ్'

ముసునూరు: జాతీయ విద్యా విధానం, సంస్కరణలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో ఈ నెల 22 నుంచి 28 వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. 22న స్థానిక వనరులతో తయారు చేసిన బోధనా సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్ర పరిచయం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, 24న క్రీడా పోటీల నిర్వహణ, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం, విద్యార్థులతో సహపంక్తి భోజనాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

చాట్రాయి మండలంలో..

చాట్రాయి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 28 వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంఈఓ బ్రహ్మాచారి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసన, నైపుణ్యాల అభివృద్ధి, 24న క్రీడా పోటీలు, 25న సాంస్కృతిక కార్యక్రమం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం నిర్వహిస్తామని చెప్పారు.

ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూజివీడు: ఆర్యవైశ్య సంఘం నూజివీడు మండల కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో నిర్వహించిన సంఘ సమావేశంలో మండల అధ్యక్షులుగా చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శిగా మానేపల్లి సతీష్‌కుమార్, కోశాధికారిగా తటవర్తి కుమార వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఎగ్జిక్యూటివ్ సభ్యులు దోసపాటి రాము, వాసవీ క్లబ్ నూజివీడు అధ్యక్షులు వనమా వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు మాటూరి ప్రసాద్ తదితరులు అభినందించారు.

రహదారులు అధ్వానం

ఆగిరిపలి: మండలంలోని ఆగిరిపల్లి పంచాయతీ రోడ్డు నుంచి చిన్న ఆగిరిపల్లి, తోటపల్లి వరకు రహదారులు అధ్వానంగా మారాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడు రహదారులపై ఉన్న గుంతలలో నీరు చేరడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆటోలు, కారులు గుంతలలో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.



తోటపల్లిలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

మైలవరం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు మరియదాసు కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో అందజేశారని రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మైలవరం మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య, మరియదాసు భార్య మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

ముసునూరు: వరుస అల్పపీడనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో 7,500 ఎకరాలలో వరి సాగు చేపట్టారు. వర్షాలు కురవడం, నారు కూడా సిద్ధమవడంతో ఆదివారం సాయంత్రానికి 2,500 ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ తెలిపారు. మరో 5,000 ఎకరాలకు సరిపడా నారు సిద్ధమవుతోందని, నెలాఖరు కల్లా 80 శాతానికి పైగా వరి నాట్లు పూర్తవుతాయని ఆయన చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో ఆగస్టు తొలి వారం నాటికి నాట్లు పూర్తి కావచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ముందుగా అందడం మరింత కలిసి వచ్చిందని రైతులు చెబుతున్నారు. బోర్లు, మోటార్ల ఆధారంగా ఉన్న గుళ్లపూడి, గుడిపాడు, సూరేపల్లి, చెక్కపల్లి గ్రామాలలో 70 శాతం వరి నాట్లు పూర్తి కాగా, లోపూడి, బలివే, యల్లాపురం గ్రామాలలో 50 శాతం వరకు నాట్లు పూర్తయ్యాయి. వరినాట్లు ముమ్మరంగా సాగుతుండడంతో గ్రామాల్లో చేతినిండా పని దొరుకుతుందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వరి నాట్లు వేస్తున్న కూలీలు

అమ్మవారికి ఆషాఢ సారె



విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లిరోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గోవిందమాంబ, ఈశ్వరీదేవి అమ్మవార్లకు విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం మహిళా నాయకులు, సభ్యులు ఆషాఢ సారెను ఆదివారం సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ నిర్వాహకుడు దాగం సత్యనారాయణ పర్యవేక్షించారు.